ముంబయిపై చెన్నై భారీ విజయం

- అజేయ సెంచరీతో చెలరేగిన సంజు శాంసన్
- 4 వికెట్లతో ముంబై బ్యాటింగ్‌ను కుప్పకూల్చిన అకీల్ హోసేన్
- 103 పరుగుల భారీ తేడాతో గెలిచిన సీఎస్కే
- పేలవ ప్రదర్శనతో చేతులెత్తేసిన ముంబై బ్యాటర్లు

విశ్వంభర, స్పోర్ట్స్ : మాజీ ఛాంపియన్ల పోరులో చెన్నై సూపర్ కింగ్స్‌దే పైచేయి. ఏకపక్ష మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌ను చిత్తుగా ఓడించిన చెన్నై పంతొమ్మిదో సీజన్‌లో మూడో విజయం నమోదు చేసింది. వాంఖడే స్టేడియంలో సంజూ శాంసన్(101 నాటౌట్) మెరుపు శతకంతో భారీ స్కోరందించగా.. స్పిన్నర్లు అకీల్ హోసేన్(417), నూర్ అహ్మద్(224)లు ముంబై బ్యాటర్లను పడికించారు. పవర్ ప్లేలోనే మూడు వికెట్లు కోల్పోయిన ముంబై ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. హిట్టర్లంతా నట్టేట ముంచగా ముంబై 104కే కుప్పకూలగా సీఎస్కే భారీ విజయంతో రెండు పాయింట్లు సాధించింది. ఐపీఎల్‌లో అతి గొప్ప పోరాటాల్లో ఒకటైన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ పంజా విసిరింది. వాంఖడేలో సంజూ శాంసన్(101 నాటౌట్) శతక గర్జనతో ముంబై ఇండియన్స్‌కు భారీ లక్ష్యాన్ని నిర్దేశించిన చెన్నై స్పిన్నర్ల విజృంభణతో అదిరే విజయం సాధించింది. ఇంపాక్ట్ సబ్ అకీల్ హోసేన్(417) తన మొదటి ఓవర్లోనే ఓపెనర్ దానిష్ మలేవర్(0)ను ఔట్ చేసి షాకిచ్చాడు. ముకుల్ చౌదరీ ఓవర్లో డికాక్(7) బంతిని వికెట్ల మీదకు ఆడుకొని వెనుదిరిగాడు. తన రెండో ఓవర్లో దేంజరస్ నమన్ ధిర్(0)ను బౌల్డ్ చేసిన అకీల్ ముంబైని ఒత్తిడిలో పడేశాడు. 11 పరుగులకే మూడు కీలక వికెట్లు పడిన వేళ గత మ్యాచ్ సెంచరీ హీరో తిలక్ వర్మ(37), సూర్యకుమార్ యాదవ్(36)లు ఆచితూచి ఆడారు. పెద్ద షాట్లకు వెళ్లకుండా సింగిల్స్, డబుల్స్.. చెత్త బంతుల్ని బౌండరీకి తరలించి స్కోర్ 50 దాటించారు. సూర్యతో కలిసి ముంబైని గట్టెక్కించాలనుకున్న తిలక్‌ను హోసేన్ బౌల్డ్ చేయడంతో నాలుగో వికెట్ 73 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. 13వ ఓవర్లో నూర్ అహ్మద్ (224). హోసేన్ వరస బంతుల్లో హార్దిక్ పాండ్యా(1), రూథర్‌ఫోర్డ్(0)లను ఔట్ చేసి ముంబై ఓటమి అంచున నిలపగా.. తర్వాతి ఓవర్లో సూర్యను ఔట్ చేసిన హోసేన్ నాలుగో వికెట్‌తో చెన్నై విజయం ఖాయం చేశాడు. 103 పరుగుల తేడాతో గెలుపొందిన చెన్నై ప్లే ఆఫ్స్ రేసులో నిలిచింది.

శతక్కొట్టిన చెటా..

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సీఎస్‌కే నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 207 పరుగులు చేసింది. సంజూ శాంసన్(54 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్స్‌లతో 101 నాటౌట్) ఒక్కడే అజేయ శతకంతో చెలరేగగా.. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ముంబై బౌలర్లలో అశ్వని కుమార్(2/37), అల్లా ఘజన్‌ఫర్(2/25) రెండేసి వికెట్లు తీయగా.. జస్‌ప్రీత్ బుమ్రా, మిచెల్ సాంట్నర్ చెరో వికెట్ తీసారు. అనంతరం ముంబై ఇండియన్స్ 19 ఓవర్లలో 104 పరుగులకు ఆలౌటైంది. సూర్యకుమార్ యాదవ్(30 బంతుల్లో 5 ఫోర్లుతో 35), తిలక్ వర్మ(29 బంతుల్లో 5 ఫోర్లతో 37) టాప్ స్కోరర్లుగా నిలవగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. దానిష్ మలెవర్(0), నమన్ ధీర్(0), షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్(0) డకౌట్ కాగా.. మిగతా బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లలో అకీల్ హోసెన్(4/17) నాలుగు వికెట్లతో ముంబై ఇండియన్స్ పతనాన్ని శాసించగా.. నూర్ అహ్మద్(2/23) రెండు వికెట్లు పడగొట్టాడు. ముఖేష్ చౌదరీ, అన్షుల్ కంబోజ్, జెమీ ఓవర్టన్, గుర్జప్నీత్ సింగ్ తలో వికెట్ తీసారు.

మలుపు తిప్పిన అకీల్ హోసేన్..

చెన్నైసూపర్‌కింగ్స్ బ్యాటర్లలోసంజూ శాంసన్ మినహా మరే బ్యాటర్ చెప్పుకోదగ్గ స్కోర్ చేయలేదు. దాంతో సీఎస్‌కే 207 పరుగులకే పరిమితమైంది. ఈ 208 పరుగుల లక్ష్యాన్ని ముంబై ఇండియన్స్ ఈజీగా ఛేజ్ చేస్తుందని అంతా అనుకున్నారు. కానీ తొలి ఓవర్‌నే స్పిన్నర్ అకీల్ హోసేన్‌తో వేయించి రుతురాజ్ గైక్వాడ్ ఫలితాన్ని రాబట్టాడు. దానిష్ మలేవార్(0)ను అకీల్ డకౌట్ చేయగా..సిక్సర్‌తో జోరు కనబర్చిన క్వింటన్ డికాక్(7)ను ముఖేష్ చౌదరీ పెవిలియన్ చేర్చాడు. తన మరుసటి ఓవర్‌లో నమన్ ధీర్(0)ను అకీల్ హోసేన్ డకౌట్ చేసి ముంబై పతనాన్ని శాసించాడు. మూడు ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోవడంతో ముంబై బ్యాటర్లు తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. దాంతో పవర్ ప్లేలో ముంబై 3 వికెట్లు కోల్పోయి 29 పరుగులే చేసింది. ఇక్కడే మ్యాచ్ సీఎస్‌కే వశమైంది.

ఆ ఒక్క తప్పిదమే..

మా కొంపముంచింది: హార్దిక్ పాండ్యా

విశ్వంభర, స్పోర్ట్స్ : పవర్ ప్లేలోనే మూడు వికెట్లు కోల్పోవడం తమ పతనాన్ని శాసించిందని ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా అన్నాడు. భారీ లక్ష్యాన్ని ఛేదించాలంటే మెరుగైన ఆరంభం లభించాలని, అది జరగలేదని తెలిపాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా వాంఖడే వేదికగా గురువారం చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే)తో జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన ముంబై ఇండియన్స్ 103 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. సీఎస్‌కే నిర్దేశించిన 208 పరుగుల లక్ష్య ఛేదనలో ముంబై ఇండియన్స్ 104 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ మ్యాచ్ అనంతరం తమ పరాజయంపై స్పందించిన హార్దిక్ పాండ్యా.. పిచ్ బాలేదనే సాకులు తాను చెప్పనని, ప్రత్యర్థి తమ కంటే మెరుగ్గా బ్యాటింగ్ చేసిందని కొనియాడాడు. ముఖ్యంగా సంజూ శాంసన్ అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చాడని ప్రశంసించాడు. వచ్చే మ్యాచ్‌ల్లో ఏం మార్పులు చేయాలో ఆలోచించి తమ తప్పులను సరిదిద్దుకుంటామన్నాడు. 'పవర్‌ప్లేలోనే వికెట్లు కోల్పోవడంతో మ్యాచ్‌లో వెనుకబడిపోయాం. ఆ తర్వాత మేం కోలుకోలేకపోయాము. పిచ్ మారింది, బాలేదు అనే సాకులు నేను చెప్పను. సాకులు చెప్పడం నాకు నచ్చదు. సీఎస్‌కే అద్భుతంగా బ్యాటింగ్ చేసింది. 207 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఇది సేమ్ వికెట్. అదే మట్టి. మేమే ఇంకా మెరుగ్గా బ్యాటింగ్ చేయాల్సింది. ఈ వికెట్‌పై స్పిన్నర్లకు పట్టుదొరికింది. మా స్పిన్నర్లు కూడా బాగానే బౌలింగ్ చేశారు. కానీ సంజూ శాంసన్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు.

అదే సమయంలో ఇతర బ్యాటర్లు ఒకరి తర్వాత ఒకరు వచ్చి స్కోరు బోర్డును ముందుకు నడిపించారు. తద్వారా సీఎస్‌కే మంచి లక్ష్యాన్ని నమోదు చేసింది. పవర్ ప్లేలో మెరుగైన ఆరంభం లభిస్తే ఈ లక్ష్యాన్ని మేం ఛేదించేవాళ్లం. కానీ పవర్ ప్లేలోనే మాకు కావాల్సిన మూమెంటమ్ లభించలేదు. వచ్చే మ్యాచ్‌ల్లో తుది జట్టులో చేయాల్సిన మార్పుల గురించి చర్చిస్తాం. ఏం చేయాలనేది ఆలోచించి నిర్ణయం తీసుకుంటాం. మా తదుపరి మ్యాచ్‌కు కొన్ని రోజుల సమయం ఉంది. మేం మా తప్పిదాలపై ఫోకస్ పెడుతాం.'అని హార్దిక్ పాండ్యా చెప్పుకొచ్చాడు.

మీ వెనుక కేసీఆర్ ఉన్నారు

- మీరు ధైర్యంగా పోరాటం చేయండి
- సమ్మె చేసే ఉద్యోగులను ఆర్టీసీ ఎండీ బెదిరిస్తున్నారు..
- ముందు ఆయన ఉద్యోగం ఉంటుందో లేదో చూసుకోవాలి
- రాణిగంజ్ డిపో వద్ద తలసాని శ్రీనివాస్ యాదవ్ ఘాటు వ్యాఖ్యలు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : మీరు ధైర్యంగా పోరాటం చేయండి.. మీ వెనుక కేసీఆర్ ఉన్నారని ఆర్టీసీ కార్మికులకు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రెండో రోజు ఆర్టీసీ సమ్మెలో భాగంగా మహాధర్నా కార్యక్రమానికి సంఘీభావం తెలిపిన ఆయన రాణిగంజ్ డిపో వద్ద మాట్లాడారు. ఆ నాడు కేసీఆర్ సకల జనులను ఏకం చేశారు. అందులో ఆర్టీసీ కార్మికులు ప్రధాన పాత్ర పోషించారని గుర్తు చేశారు. తెలంగాణ సాధనలో ఆర్టీసీ కార్మికుల కృషి మర్చిపోలేనిదన్నారు. ఆ విషయం ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలని సూచించారు. అవసరమైతే ప్రభుత్వాన్ని కూల్చే శక్తి ఆర్టీసీ కార్మికులకు ఉందన్నారు. గతంలో కేసీఆర్ కేబినెట్ ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీసుకోవాలని నిర్ణయం తీసుకుందన్నారు. అంతలోనే ప్రభుత్వం మారిందన్నారు. ఆర్టీసీకి ఎంతో ప్రాముఖ్యత ఉందని గుర్తు చేశారు. రెండు రోజులుగా ఆర్టీసీ సమ్మె చేస్తుంటే.. ప్రజలు అల్లాడి పోతున్నారని గుర్తు చేశారు. ప్రతిపక్ష నేతలు వెనుకుండి సమ్మే చేయిస్తున్నారని ఓ మంత్రి అంటున్నారు. అసలు మీరు ఇచ్చిన హామీలు తీరస్తే.. సమ్మే ఎందుకు చేస్తారని ప్రశ్నించారు. సమ్మె చేసే ఉద్యోగులను ఆర్టీసీ ఎండీ బెదిరిస్తున్నారని.. ముందు నీ ఉద్యోగం ఉంటుందో లేదో చూసుకోవాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు. వచ్చేది మా ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. "అందరం కలిసి సెక్రటేరియట్ ముట్టడికి వెళ్దాం. ప్రభుత్వం మెడలు వంచి హామీలు సాధిద్దం. పీఆర్‌సీ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చారు. ఎలక్ట్రికల్ బస్సులకు ప్రైవేట్ డ్రైవర్లను పెట్టి నడిపిస్తున్నారు. ఆర్టీసీ బస్సు నడిపిన డ్రైవర్లకు ఎలక్ట్రికల్ బస్సు నడపడం రాదా? ఆర్టీసీ కార్మికులకు కూడా విజ్ఞప్తి చేస్తున్నాను. మీరు ధైర్యంగా పోరాటం చేయండి. మీ వెనుక మా పార్టీ మొత్తం ఉంది. 29 డిమాండ్స్ తీర్చేందుకు సిద్ధంగా ఉన్నామని అంటున్నారు. మరి ఆ 29 డిమాండ్స్ ఏంటో మీడియా సాక్షిగా విడుదల చేయాలి. మీ కాబినెట్ తరువాత వెంటనే ఆర్టీసీ జేఏసీని చర్చలకు పిలవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న. హామీల విషయంలో పూర్తి స్పష్టత ఇవ్వాలి. తూతు మంత్రంగా ఒప్పుకోవద్దని జేఏసీ సంఘాల నాయకులకు కూడా విజ్ఞప్తి చేస్తున్నా. మీరు కొట్లాడితే.. మీతో పాటు ముందు వరసలో మేము ఉంటాము.." మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వ్యాఖ్యానించారు.

తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలను రాహుల్ గాంధీకి వివరించా

టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాల పురోగతిని లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వివరించినట్లు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న హామీలు ప్రజల్లోకి ఏ మేరకు వెళ్తున్నాయనే అంశంపై రాహుల్ ఆరా తీసినట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా సంస్థాగత వ్యవహారాలు, పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే దిశగా పని చేస్తున్నట్లు రాహుల్ గాంధీకి వివరించినట్లు తెలిపారు. మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలోని రాష్ట్ర కాంగ్రెస్ ప్రతినిధి బృందం గురువారం ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని కలిసారు. ఈ బృందంలో రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, సీనియర్ నేత వి. హనుమంతరావు కూడా ఉన్నారు.

ఈ భేటీలో బీసీ జనగణన ప్రధానాంశంగా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. 'బీసీ గణన చేస్తామని ప్రధాని మోదీ చెప్పారు, కానీ అది క్షేత్రస్థాయిలో అమలు కావాలి' అని రాహుల్ పేర్కొన్నట్లు సమాచారం. రాహుల్ గాంధీ ఆదేశాలకనుగుణంగా తెలంగాణ లో కుల గణన ప్రక్రియ పూర్తి చేసి సమగ్ర నివేదిక ను ప్రకటించినట్లు ఆయనకు వివరించారు .బీసీ మహిళలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌ను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. తెలంగాణలో పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు తీపి కబురు అందిస్తూ మహేష్ కుమార్ గౌడ్ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పోస్టులను మే నెలలోగా భర్తీ చేస్తామని ఆయన వెల్లడించారు. దీనికి సంబంధించి ఇప్పటికే కసరత్తు పూర్తయిందని, త్వరలోనే తుది నిర్ణయం వెలువడుతుందని తెలిపారు.రాహుల్ గాంధీతో భేటీ అత్యంత సంతృప్తికరంగా సాగిందని, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి రాహుల్ కొన్ని సూచనలు చేశారని మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. వచ్చే ఎన్నికల దృష్ట్యా పార్టీ కేడర్‌ను సిద్ధం చేయడమే తమ తక్షణ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

'అమెరికాను వీడి వెళ్లిపోదాం ఇక'..

40శాతం మంది భారతీయుల ఆలోచన..!

విశ్వంభర, నేషనల్ బ్యూరో: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండో దఫా హయాంలో అనుసరిస్తున్న విధానాలపై సర్వత్రా వ్యతిరేకత ఎదురవుతోంది. ముఖ్యంగా 'అమెరికా అమెరికన్లకు మాత్రమే' అన్న నినాదం వలసదారులను ఇబ్బంది పెడుతోంది. దీంతో చాలా మంది విదేశీ సంతతి పౌరులు అగ్రరాజ్యాన్ని వీడేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అమెరికా నుంచి శాశ్వతంగా వెళ్లిపోవాలని ప్రతి పది మంది ఇండియన్‌అమెరికన్లలో నలుగురు ఆలోచిస్తున్నట్లు తాజాగా ఓ సర్వేలో వెల్లడైంది. అమెరికాలో జీవన విధానాలు, ట్రంప్ ప్రభుత్వ తీరుపై అంతర్జాతీయ సంస్థ కార్నెగీ ఎండోమెంట్ ఇటీవల సర్వే నిర్వహించింది. ఇందులో 40శాతం మంది ఇండియన్‌అమెరికన్లు అగ్రరాజ్యాన్ని శాశ్వతంగా వీడేందుకు తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు తేటతెల్లమైంది. 'రాజకీయ అస్థిరత' వల్లే తాము అమెరికా నుంచి వెళ్లిపోవాలని అనుకుంటున్నట్లు వీరిలో 58శాతం మంది చెప్పినట్లు సర్వే తెలిపింది. రెండో దఫాలో ట్రంప్ పాలనపై తాము అసంతృప్తిగా ఉన్నామని 71శాతం ఇండియన్‌అమెరికన్లు వెల్లడించారు. 202425 నాటి గణాంకాల ప్రకారం..ప్రస్తుతం 54 లక్షల మందికి పైగా భారతీయులు అమెరికాలో నివసిస్తున్నారు. అగ్రరాజ్య మొత్తం జనాభాలో వీరు 1.5శాతానికి సమానం కావడం గమనార్హం.

25శాతం తగ్గిన హెచ్-1బి వీసాలు..

ఇదిలా ఉండగా.. ట్రంప్ అధికారంలోకి రాగానే వలస విధానాలను కఠినతరం చేసిన సంగతి తెలిసిందే. ఈ ఆంక్షలతో సరిహద్దులో అక్రమ వలసల కంటే కూడా..అమెరికాలోకి చట్టబద్ధ వలసలే భారీగా తగ్గాయట. ఈ మేరకు అగ్రరాజ్య మేధో సంస్థ క్యాటో ఇనిస్టిట్యూట్ సర్వే వెల్లడించింది. ముఖ్యంగా హెచ్ 1బీ వీసాల జారీలో భారీ తగ్గుదల నమోదైట్లు తెలిపింది.''ట్రంప్ అధికారంలోకి రాక ముందు నుంచే అక్రమ వలసలు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం ప్రభుత్వ పాలనలోనూ ఆ ట్రెండ్ కొనసాగింది. అయితే, దీనికి భిన్నంగా చట్టబద్ధ వలసలు గతంతో పోలిస్తే భారీగా తగ్గాయి. అత్యధికంగా హెచ్ 1బీ వీసాలపైనే ఈ ప్రభావం ఎక్కువగా కన్పించింది. గత సంవత్సరంలో ఈ వీసాల జారీ 25శాతం మేర తగ్గింది. ఇక, లక్ష డాలర్ల ఫీజు అమల్లోకి వచ్చిన తర్వాత హెచ్ 1బీ వీసాల కోసం కంపెనీల నుంచి పిటిషన్లు ఏకంగా 87శాతం తగ్గాయి. అంటే ఈ ఆర్థిక సంవత్సరంలో హెచ్ 1బీ వీసాలు మరింతగా తగ్గొచ్చు'' అని సర్వే అంచనా వేసింది. సోషల్ మీడియా వెట్టింగ్ తదితర ఆంక్షల కారణంగా విద్యార్థి వీసాలు కూడా 40శాతం మేర తగ్గినట్లు సర్వే వెల్లడించింది.

శ్రీ షిరిడి సాయి భక్త భజన మండలి ఆధ్వర్యంలో

ఉచిత మజ్జిగ వితరణ

విశ్వంభర, కరీంనగర్ : శ్రీ షిరిడి సాయి భక్త భజన మండలి ఆధ్వర్యంలో స్థానిక సివిల్ హాస్పిటల్ సమీపంలో మధ్యాహ్నం ఉచిత మజ్జిగ వితరణ గావించడం జరిగింది. శ్రీ శిరిడి సాయి భక్త భజన మండలి గౌరవ అధ్యక్షులు నలుమాచు చంద్రశేఖర్ మాట్లాడుతూ..గత తొమ్మిది సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం మండే వేసవి కాలంలో ప్రతి గురువారం కరీంనగర్ పట్టణంలోని ఏదో ఒక ప్రదేశంలో పాదాచార్ల మరియు దాహర్తుల దాహాన్ని తీర్చే సదుద్దేశంతో ఉచిత మజ్జిగ వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. అధ్యక్షులు దగ్గుల మధుసూదన్ మాట్లాడుతూ దాతల, సహృదయల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గురువారం దాతలుగా వ్యవహరించిన శ్రీ శిరిడి సాయి భక్త భజన మండలి వ్యవస్థాపక అధ్యక్షులు ముద్దసాని శంకర్ మరియు రాణి కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ సంవత్సరం మజ్జిగ వితరణ కన్వీనర్ రాచమడుగు వనజ వేణు మహేశ్వరరావు, మౌనిక, శివ, నరసయ్య, అనసూయ, పూర్ణ, సాయిరాం, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

భారీ నష్టాల్లోనే దేశీయ స్టాక్ మార్కెట్లు

విశ్వంభర, ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ భారీ నష్టాలు చవిచూశాయి. ఇరాన్ అమెరికా మధ్య చర్చలపై నీలినీడలు కమ్ముకోవడం, హర్మూజ్ వద్ద దిగ్బంధనం కొనసాగుతుండడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. చమురు ధర బ్యారెల్ మళ్లీ 100 డాలర్ల ఎగువకు చేరడం సూచీలపై ప్రతికూల ప్రభావం చూపింది. దీంతో సెన్సెక్స్ 850 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 24,200 దిగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 77,983.66 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,516.49) నష్టాల్లో ప్రారంభమై.. రోజంతా అదే బాటలో పయనించింది. ఇంట్రాడేలో 77,574.18 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 852.49 పాయింట్ల నష్టంతో 77,664.00 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 205.05 పాయింట్ల నష్టంతో 24,173.05 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ మళ్లీ 94 మార్కు దాటి 94.10కు చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, టెక్ మహీంద్రా, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇన్ఫోసిస్ స్టాక్స్ ప్రధానంగా నష్టపోయాయి. అదానీ పోర్ట్స్, ఎల్‌అండ్‌టీ, సన్‌ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్, బీఈఎల్ మాత్రమే లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 103 డాలర్ల వద్ద కొనసాగుతుండగా..బంగారం 4688 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

కుప్పకూలుతున్న బంగారం ధరలు

విశ్వంభర, ముంబయి: బంగారం, వెండి ధరలు ఒక్కసారిగా నీరసించాయి. ఎంసీఎక్స్ (MCX) మార్కెట్‌లో వెండి ఏకంగా 2.5 శాతం మేర పడిపోగా, పసిడి కూడా నష్టాల బాటలో పయనిస్తోంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ నిర్ణయాలు ఇన్వెస్టర్లను కలవరపెడుతున్నాయి. గురువారం బంగారం ధరలు ఇలా ఉన్నాయి 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,51,976 పలుకుతోంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,41,079 పలుకుతోంది. పసిడి ధరలు నిన్నటితో పోల్చి చూస్తే నేడు భారీగా తగ్గినట్లు గమనించవచ్చు. పసిడి ధరలు మార్కెట్లో గడిచిన కొంత కాలంగా గమనించినట్లయితే స్థిరంగా ఉన్నాయని చెప్పవచ్చు. ఈ ఏడాది ప్రారంభం నుంచి గమనించినట్లయితే బంగారం ధరలు ఆల్ టైం రికార్డ్ స్థాయి నుంచి తగ్గుతూ వచ్చాయి. దానికి జనవరి 28వ తేదీ బంగారం ధర 10 గ్రాములకు గాను 1.83 లక్షల రూపాయల వద్ద ఆల్ టైం రికార్డును నమోదు చేసింది. అక్కడ నుంచి బంగారం ధర తగ్గినట్లు చూడవచ్చు.

బంగారం ధరలు ఎక్కువగా అంతర్జాతీయ మార్కెట్ల పైన ఆధారపడి ఉంటాయి. సురక్షితమైన పెట్టుబడిగా బంగారాన్ని భావించి అందులో ఎక్కువగా పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపిస్తూ ఉంటారు. బంగారాన్ని రిటర్న్స్ ఇచ్చే సాధనం కన్నా ఉన్న డబ్బును సురక్షితంగా దాచుకునేందుకు ఉపయోగించే సాధనంగానే భావిస్తారు. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఏవైనా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఏర్పడినప్పుడు బంగారం లో ఇన్వెస్ట్ చేసేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపిస్తుంటారు. సాధారణంగా ఇన్వెస్టర్లు ఎక్కువగా ఈక్విటీ మార్కెట్లలోనూ పలు దేశాలు జారీ చేసే బాండ్లలోనూ డబ్బులు ఇన్వెస్ట్ చేసేందుకు ఆసక్తి చూపిస్తారు. ఎందుకంటే అలాంటి సాధనాల్లో ఇన్వెస్ట్ చేసినట్లయితే తమకు రిటర్న్స్ ఎక్కువగా వస్తాయని భావిస్తారు. ఉదాహరణకు ఈక్విటీ మార్కెట్లలో రిటర్న్స్ ఎక్కువగా ఉంటాయి. సాధారణంగా ఇన్వెస్ట్ ఈక్విటీ మార్కెట్లలోనూ డబ్బు ఇన్వెస్ట్ చేసేందుకు ఆసక్తి చూపిస్తారు. కానీ ఈక్విటీ మార్కెట్లో ఎప్పుడైతే ఒత్తిడికి లోనై నష్టాలను అందించేందుకు సిద్ధంగా ఉంటాయో అప్పుడు ఇన్వెస్టర్లు తమ డబ్బును బంగారం లాంటి సేఫ్ ఇన్వెస్ట్‌మెంట్ జోన్ లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తారు. ఆ సమయంలోనే బంగారం ధర పెరుగుతుంది. ప్రస్తుతం పసిడి ధరలు స్థిరంగా ఉన్నప్పటికీ కూడా భవిష్యత్తులో ఇరాన్ యుద్ధం కారణంగా తీవ్రమైన ఒడిదుడుకులకు లోనయ్యే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

రిపోర్టర్లు కావలెను

V3 NEWS
ప్రజా "విశ్వంభర"
తెలుగు దిన పత్రిక

ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా
రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్,
న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు,
యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్
పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.

సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్,
మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి × రోడ్స్,
దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.

సెల్: 9441222429, 8885402108